# తుమ్మల జగదీష్

## ఎక్సెలెన్స్ ఇన్ ఫార్మింగ్

ఎదిగే బిడ్డను చూసి తండ్రి మురిసిపోయినట్టు...

పెరిగే పంటను చూసి రైతు ఎంతో సంతోషిస్తాడు.

జగదీశ్ యాదవ్ వేసిన చెరకు పంట నిచ్చెన వేసుకుని ఎక్కేంత ఎత్తు ఎదిగింది.

సాగు అతనొక్కడిదే అయినా సంతోషం మనందరిదీ. ఎందుకంటే... అతను చేసింది సేంద్రీయ వ్యవసాయం.

మట్టిని నమ్ముకున్న రైతు ఎప్పుడూ నష్టపోడు అంటారు...

అది నమ్మకం కాదు నిజమని నిరూపిస్తున్నారు వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పట్లూర్ గ్రామానికి చెందిన తుమ్మల జగదీష్ యాదవ్.

డిగ్రీ చదువుకున్న జగదీష్ తండ్రిబాటలోనే పొలంబాట పట్టి వ్యవసాయాన్నే ఉద్యోగంగా ఎంచుకున్నారు.

ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగుల మందులు వాడకుండా తనకున్న 30 ఎకరాల్లో సేంద్రీయ సాగు చేస్తూ పదిమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

మట్టిద్రావణాన్ని పంటలపై పిచికారీ చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని చెప్పిన ప్రముఖ రైతు శాస్త్రవేత్త చింతల వెంకటరెడ్డి విశేషకృషికి తగిన ఫలితాలు సాధించి చూపిస్తున్నారు జగదీష్ యాదవ్.

సివిఆర్ పద్ధతిలో వ్యవసాయం చేస్తూ కేవలం మట్టిని పిచికారీ చేస్తే అతని పొలంలో చెరకు 15 అడుగుల ఎత్తుకు పెరిగింది. పంటకు వేయడానికి ముందు పొలంలో గొర్రెలమంద కట్టడం, పంట కాలంలో పదిసార్లు మట్టి ద్రావణాన్ని స్ప్రే చెయ్యడం మినహా ఈ రైతు ఎలాంటి మందులు, ఎరువులు వాడలేదు. ఈ ద్రావణం తయారీలో రెండు రకాల

మట్టిని ఉపయోగిస్తారు. భూమికిపైన ఆరంగుళాల లోతు వరకు ఉన్న మట్టిని పైమట్టిగా, ఆ తర్వాత మరో నాలుగు అంగుళాల లోతు వరకు తవ్విన మట్టిని లోపలి మట్టిగా పరిగణిస్తారు. ఈ రెండింటినీ సమపాళ్లలో నీటిలో కలిపి ద్రావణంగా తయారు చేసి దాన్ని పంటపై పిచికారీ చేస్తారు. ఇదే పద్ధతిలో జగదీష్ యాదవ్ పత్తి, కంది, మొక్కజొన్న, ఇతర కూరగాయలు పండిస్తూ అద్భుత దిగుబడి సాధిస్తున్నారు.

రసాయనాలు, ఎరువులు వాడే రైతులు ఎకరానికి 20 వేలు పెట్టుబడి పెడుతుంటే... అందులో పదవవంతుకంటే తక్కువ పెట్టుబడితో అత్యధిక రాబడి అందుకుంటూ మరింతమంది రైతుల్ని సేంద్రీయ వ్యవసాయంవైపు చూసేలా చేస్తున్నారు.

పర్యావరణానికి మేలు చేస్తూ, ప్రజల ఆరోగ్యానికి అండగా నిలుస్తోన్న ఈ మట్టిమనిషిని సాక్షి ఎక్సలెన్స్ అవార్డ్స్ 2017 ఉత్తమ రైతుగా సత్కరిస్తోంది.